క్లుప్తంగా

వలసల గంగమ్మకు పూజలు



శింగనపల్లిలో బోనాల గంపలు ఎత్తుకెళ్తున్న మహిళలు

తలుపుల : మండలంలోని శింగనపల్లి, చదల వాండ్లపల్లి గ్రామాల్లో వర్షం కోసం మంగళవారం వలసల గంగమ్మకు బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనాల గంపలు ఎత్తుకొని బొడ్రాయిలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామం బయట వలసల గంగమ్మను ప్రతిష్ఠించి పూజల చేపట్టారు. తర్వాత బోనాలు సమర్పించి వర్షాభావ పరిస్థితుల నుంచి తమను గట్టెక్కించాలని మొక్కుకున్నారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు



చెన్నేకొత్తపల్లి: చిన్నంపేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి బాలమ్మ ఇంటి పెరట్లోని బ్రహ్మ కమలం మొక్కకు బ్రహ్మ కమలాలు విరబూశాయి. ఇవి ఏడాదికి ఒకసారి మాత్రమే వికసిస్తాయని ఆమె తెలిపారు. ఒకే మొక్కకు దాదాపు 30 పుష్పాలు విరబూయడంతో ఆమె మొక్కకు పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల వారు పుష్పాలను ఆసక్తిగా తిలకించారు.

మెగా జాబ్‌మేళా



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోవు రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని తెలియజేశారు. మొత్తం 316 హాజరుకాగా అందులో 97 మంది వివిధ కంపెనీల ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. స్మిత తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగార్జున, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ వసతిగృహ భవనం పరిశీలన



హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న నిర్మల జ్యోతి

నల్లచెరువు: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహ భవనాన్ని జిల్లా బీసీ వేల్ఫేర్ ఆఫీసర్ నిర్మల జ్యోతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2003లో పఠాన్ షెక్షావలి అనే వ్యక్తి బీసీ హాస్టల్ నిర్మాణానికి స్థలం ఇచ్చారన్నారు. కొన్ని అనివార్య కారణాలతో హాస్టల్ భవనం పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. త్వరలో హాస్టల్ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ అశోక్, బీసీ హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ధర్మవరం ఆదిత్య పాఠశాల విద్యార్థిని ఎ.అక్షవేణి రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. స్థానిక పాఠశాలలో మంగళవారం కరస్పాండెంట్ పీ జనార్ధన్ వివరాలను తెలిపారు. ఇటీవల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్‌లో జరిగిన స్టేట్ జూడో టోర్నీలో ఆరో తరగతి విద్యార్థిని ఎ.అక్షవేణి మైనస్ 23 కిలోల విభాగంలో స్టేట్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. గుజరాత్‌లో అక్టోబర్ 2, 3 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. కరస్పాండెంట్‌తోపాటు జూడో కోచ్ ఎస్.ఇనాయత్ విద్యార్థినిని అభినందించారు.

కరువు.. దరువు

ధర్మవరం నియోజకవర్గ రైతులకు ఖరీఫ్ –2024 కలసిరాలేదు. అవసరమైన సమయంలో వర్షాలు ముఖం చాటేశాయి. వేరుశనగ, కంది పంటలు ఎండుముఖం పట్టాయి. బోరుబావుల్లోనూ నీళ్లు తగ్గిపోవడంతో దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. మరో 15 రోజుల్లోపు వర్షం పడకపోతే పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వర్షం లేక ఎండుతున్న పంటలు
- దిగుబడులపై తీవ్రస్థాయిలో ప్రభావం
- పెట్టుబడులూ దక్కవని రైతుల దిగాలు



రేగాటిపల్లి వద్ద వర్షం లేక ఎండిపోతున్న వేరుశనగ పంట

ధర్మవరం రూరల్: సంప్రదాయ పంట వేరుశనగతో పాటు కంది సాగు చేసిన రైతులకు ఈ ఏడాది కూడా నిరాశే ఎదురవుతోంది. జూలై, ఆగస్టు, ఈ నెల మొదట్లో కురిసిన వర్షాలకు పంటలు పచ్చగా కనిపించాయి. మంచి దిగుబడులు వస్తాయనుకున్న రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. గత పది రోజులుగా ఎండలు ఎక్కువగా ఉండడంతో పాటు వర్షాలు పడకపోవడంతో వేరుశనగ, ఇతర పంటలు ఎండుముఖం పట్టాయి. కాయల్లో ఉన్న అరకొర గింజల్లో తేమశాతం కూడా లేక లొత్తలుగా మారుతున్నాయి. మరో వారంలోపు మంచి వర్షం పడితేనే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంది. లేకుంటే పెట్టుబడులు సైతం తిరిగి రాక భారీగా నష్టం చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాతాళానికి చేరిన గంగ

ధర్మవరం నియోజకవర్గంలో రెండేళ్ల క్రితం వరకు బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉంది. అప్పట్లో పది అడుగుల్లోనే నీరు లభ్యమయ్యేది. ప్రస్తుతం 500 నుంచి 700 అడుగుల దిగువకు నీరు పడిపోయింది. ఇటీవల ఎండలు మండిపోతున్నాయి. బోరు బావుల్లో వస్తున్న అరకొర నీరు పైర్లకు ఏ మాత్రమూ సరిపోవడం లేదు. పంటను కాపాడుకోవడం కోసం కొందరు రైతులు కొత్తగా బోరు బావులు తవ్వుకుంటున్నారు.

సెప్టెంబర్‌లో సరైన వర్షమేదీ?

ఏటా ఖరీఫ్‌లో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే వేరుశనగ పంటకు తీవ్ర నష్టం జరుగుతోంది. పంట మూడు నెలల కాలంలో మూడు డ్రై స్పెల్ ఉంటాయి. వేరుశనగ పంటకు ముఖ్యమైన పూత దశ, ఊడలు దిగే దశ, గట్టి పడే దశల్లో వర్షం కురవకపోవడంతో దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడింది. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పదునైన వర్షాలు కురిస్తే పూర్తి స్థాయిలో దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుత సెప్టెంబర్‌లో ఇప్పటి వరకు సరైన వర్షం కురవలేదని చెబుతున్నారు.

ఎకరాకు 30 వేలు పెట్టుబడి

ఈ పర్యాయం ఎకరా వేరుశనగ సాగుకు రూ.30 వేల దాకా రైతులు పెట్టుబడి పెట్టారు. ఇందులో రెండుసార్లు దున్నేందుకు ట్రాక్టర్ అద్దె రూ.3వేలు, విత్తన కాయలకు రూ.6వేలు, విత్తు వేసేందుకు మడక, నలుగురు కూలీల ఖర్చులు రూ.2వేలు, కలుపు తీయడానికి పది మంది కూలీలకు రోజుకు రూ.300 లెక్కన రూ.3వేలు, ఎరువులకు, నూర్పిడికి రూ.10 వేలు ఖర్చు చేశారు.

ధర్మవరం నియోజకవర్గంలో కంది, వేరుశనగ సాగు వివరాలు

మండలం	విస్తీర్ణం
బత్తలపల్లి	5,286 హెక్టార్లు
తాడిమర్రి	5,170 హెక్టార్లు
ముదిగుబ్బ	8,992 హెక్టార్లు
ధర్మవరం	4,463 హెక్టార్లు

దిగుబడి ప్రశ్నార్థకం



నేను 5 ఎకరాలలో వేరుశనగ సాగు చేశాను. 20 రోజుల క్రితం వరకు వేరుశనగ పంట కళకళలాడుతూ ఉండేది. ఈ నెలలో వాన జాడే లేదు. పంట చాలా వరకు వాడి ఎండిపోతోంది. పది రోజుల్లో వాన రాకుంటే దిగుబడి ప్రశ్నార్థకమే. పెట్టుబడులు వస్తాయో.. రావో? అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

– కాటమయ్య, రైతు, ధర్మవరం

ఈ దఫా పంటలు పోయినట్టే



రెండు ఎకరాల్లో వేరుశనగ, 5 ఎకరాలలో కంది సాగు చేశాను. పంటల సాగుకు ఇప్పటికే చాలా వరకు ఖర్చు చేశాను. ప్రస్తుతం వర్షం కురవపోవడంతో పంటలు ఎండి పోతున్నాయి. వ్యవసాయం చేసుకోవడం కన్నా కూలి పనులు చేసుకోవడం మేలు.

– మాధవయ్య, రైతు, చిగిచెర్ల

వరద బాధితులకు విరాళం



కలెక్టర్ టీఎస్ చేతన్‌కు చెక్కు అందిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గోవింద పేటలోని సేవా సమితి సభ్యులు రూ.50 వేలు విరాళం అందజేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలసి చెక్కును అందించారు. చెక్కును అందజేసిన విశ్రాంత అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్ప, స్టోర్ డీలర్ నాయుడు, కడియాల కృష్ణమోహన్, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు షామీర్‌ను కలెక్టర్ అభినందించారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

తనకల్లు ఎస్ఐగా గోపి



తనకల్లు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా కే గోపి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన లేపాక్షిలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతానని హెచ్చరించారు.

30న అద్దె భవనాల వేలం

బత్తలపల్లి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద నిర్మించిన షాపు గదులకు ఈనెల 30న వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ మంగళవారం తెలిపారు. వేలం దక్కించుకున్న వారు నెలసరి అద్దె ప్రాతిపదికన మూడేళ్ల పాటు షాపులు నిర్వహించుకోవచ్చన్నారు.

కూటమి నేతల దాడి పిరికిపందల చర్య



ఘటనపై కేతిరెడ్డిని అడిగి తెలుసుకుంటున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

ధర్మవరం రూరల్: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మంగళవారం వైఎస్సార్‌సీపీ పంచాయితీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి పరామర్శించి ఘటన గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది పిరికి పందల చర్య అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో అభివృద్ధి, శాంతియుత వాతావరణాన్ని కల్పించిన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో పోటీ పడాలి కాని ఇలా దాడులను ప్రోత్సహించడం సరికాదని హితవు పలికారు. శాంతి భద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



ధర్మవరంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు



కదిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే జరుపుకుంటున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామాల పరిశుభ్రత, మొక్కల పెంపకం తదితర సేవా కార్యక్రమాలు చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించారు.

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీం(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత ఎన్ఎస్ఎస్ డే ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవా కార్యక్రమాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు క్రిష్ణానాయక్, హనుమంత రావ్‌లతో పాటు పలువురు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ఈసందర్భంగా ఆయన ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకులు ఎంఎస్ ప్రశాంత్, వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కవితా, రిజ్వానాతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మడకశిరరూరల్: మండల పరిధిలోని బీ రాయాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ధర్మస్థలం మంజునాథ స్వామి ఆలయ ట్రస్టు పీఓ మహేష్ రూ.లక్ష చెక్కును మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రమణారెడ్డి

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రత పరిరక్షణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ సలహా మండల జిల్లా మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన ఉజ్వల ఫౌండేషన్ వద్దనున్న తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం సబ్ జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలను పరామర్శించేందుకు వెళ్లిన ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై దాడి చేయడం హేయమన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేయడాన్ని కవర చేసేందుకు యత్నించిన విలేకరిపై కూటమి నేతలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఘటనలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే మంతి సత్యకుమార్ ఇలాంటి సంఘటనలు ప్రోత్సహించకూడదన్నారు. కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. వీరి ఆగడాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామన్నారు.

బత్తలపల్లి మండలానికి రాష్ట్ర డైరెక్టర్ పదవి



విజయ్‌కుమార్

బత్తలపల్లి: మండలానికి ఏపీ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్, మౌలిక వసతుల డైరెక్టర్ పదవి వరించింది. మాల్యవంతం గ్రామానికి చెందిన గోనుగుంట్ల విజయ్‌కుమార్‌కు ఆ పదవి వరించింది. ఈయన తల్లిదండ్రులు గోనుగుంట్ల అనంతరెడ్డి(కాంగ్రెస్), గోనుగుంట్ల జయమ్మ(టీడీపీ) తరపున ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వారి ఏకైక కుమారుడు గోనుగుంట్ల విజయ్‌కుమార్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ఆర్టీసీ డిపోలో స్వచ్ఛతా హీ సేవ



మొక్కలు నాటుతున్న డీపీటీఓ మధుసూదన్

కదిరి అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. జిల్లా ప్రజారవాణా అధికారి (డీపీటీఓ) మధుసూదన్ హాజరై డిపో ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ రూట్లలో అత్యధిక ఆక్యుపెన్సీ రేషియో సాధించిన పలువురు సిబ్బందికి నగదు రివార్డులు అందజేశారు. డ్రైవర్లు, కండక్టర్లు సమన్వయంతో పని చేసి సంస్థకు ఆదాయం వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అసిస్టెంట్ డీఎం హరిత, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, ఎన్ఎంయూ నాయకులు బైరిశెట్టి, ఈయూ నాయకులు ఆర్ఎస్ రెడ్డితో పాటు పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

బత్తలపల్లి: తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ట్యాంకుల వద్ద, కుళ్లాయిల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. అనంతరం నీటి నమూనాలను పరీక్షించడం, భద్రత, వ్యక్తిగతరక్షణపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండలస్థాయి క్రీడాపోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కనగానపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంఈఓ– 2 శ్రీదేవి పోటీలను ప్రారంభించారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది దాకా క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో అండర్– 14 విభాగంలో కనగానపల్లి జెడ్పీహెచ్ఎస్ బాలురు విన్నర్స్‌గా, మోడల్ స్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్–17 బాలికల విభాగాల్లో జెడ్పీహెచ్ఎస్ కనగానపల్లి విన్నర్స్‌గా, మోడల్‌స్కూల్, కేజీబీవీ విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచారు. ఇక వాలీబాల్, యోగా పోటీల్లో మద్దెలచెరువు, మామిళ్లపల్లి, తగరకుంట విద్యార్థులు గెలుపొందారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ రమేష్ తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, హెచ్ఎం అబ్బాస్, పీఈటీలు శివారెడ్డి, జయసింహ, రమేష్, మాధవరాజులు, గురుప్రియ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నుంచి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ హరిప్రసాద్ మంగళవారం తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన 1,600 క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు బుధవారం ఉదయం 9 గంటలకు క్రీడా మైదానికి హాజరు కావాలన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి



పేరంవాండ్లపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది



తాడిమర్రి మండలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రమాదేవి

అమడగూరు: సాగు సమయంలో విత్తనశుద్ధి చేయడం వలన అధిక దిగుబడి సాధ్యమవుతుందని వ్యవసాయాధికారి (ఏఓ) వెంకటరమణాచారి తెలిపారు. మంగళవారం అమడగూరు, పేరంవాండ్లపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో ఏఓ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పెంచడం, నాణ్యత ప్రమాణాలను పాటించడం, అవసరం మేరకే రసాయన మందులను వాడడం వంటివాటిపై సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా ఆకు ముడత, పొగాకు లద్దెపురుగు, తిక్క ఆకు మచ్చతెగులు సోకవన్నారు. ఆయా రోగాల నివారణకు చర్యలను తెలియజేశారు. ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, వివిధ రకాల కొత్త వంగడాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రవీంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: రైతులకు పంటల సాగుపై సూచనలిచ్చేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఏఓ ఇలియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం బాబా సహెబ్ పల్లి, మామిళ్ళకుంట్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు రంగారెడ్డి, రామస్వామిరెడ్డి పొలాల్లో వేరుశనగ పంటను పరిశీలించి తగు సలహాలిచ్చారు. ఏఈఓ వెంకటేష్, పట్టుపరిశ్రమ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వరయ్య, వీఏఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాడిమర్రి: సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ రమాదేవి రైతులకు సూచించారు. చిల్లవారిపల్లి, దాడితోట గ్రామాల్లో మంగళవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేంద్రియ వ్యవసాయం, విత్తనశుద్ధితోపాటు వ్యవసాయ శాఖ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. పట్టుశాఖ అధికారి చంద్రమోహన్ పట్టుశాఖలో అమలు చేస్తున్న పథకాలపై వివరించారు.

తనకల్లు: విత్తనశుద్ధితో అధిక లాభాలను పొందవచ్చని ఏఓ శ్రీహరినాయక్ అన్నారు. మల్లిరెడ్డిపల్లి, నకరాళ్లతండాలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఒక కిలో వేరుశనగ విత్తనాలకు ఒక గ్రాము టిబు కోనజోల్ లేదా మూడు గ్రాముల మ్యాంగోజం మందును విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేస్తే తరువాత వచ్చే తెగుళ్లని నివారించవచ్చని పేర్కొన్నారు. ఎంపీఈఓ మెహతాజ్, రైతులు పాల్గొన్నారు.

తలుపుల : ఓబులరెడ్డిపల్లి, లక్కసముద్రం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ షాదాబ్ రైతుల పొలాలకు వెళ్లి పంటల సాగు, చీడ పీడల నివారణ, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, భూసార పరీక్షలు, ఈక్రాప్ బుకింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వీఏఏ నిఖిల్ కుమార్‌రెడ్డి, వీహెచ్ఏ చందన, సర్పంచ్ తులశమ్మ, దివాన్‌వలి, మాజీ సర్పంచ్ జయరాం పాల్గొన్నారు.

ముదిగుబ్బ: సానేవారిపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులువ్యవసాయ, అనుబంధ శాఖలు అందించే పథకాలు, నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఏఓ లక్ష్మీనరసింహులు, సర్పంచ్ ఎల్ఐసీ రమణ, ఎంపీటీసీ మంజునాథ పాల్గొన్నారు.

నల్లచెరువు: బాలేపల్లి,పి కొత్తపల్లి పోలేవాండ్లపల్లిలో మంగళవారం ఏఓ భారతి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీటీసీ మాధవీలత, హెచ్ఓ లావణ్య, డాక్టర్ మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పూతదశలో ఉందని, ఎకరాకు నాలుగు బస్తాలు జిప్సం వేసుకోవాలని ఏడీఏ కిష్టయ్య రైతులకు సూచించచారు. గొట్లూరులో మంగళవారం ఏఓ ముస్తఫా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏతో పాటు రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ విద్యావతి, సెరికల్చర్ అధికారి దామోదర్‌రెడ్డి, ఏఈఓ అశ్వని, ఎంపీఈఓ నాగార్జున, శశి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల కస్తూర్బా బాలికల పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక ,శారీరక ఒత్తిడికి గురవడంతో పాటు ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోతారన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, వివాహం చేసినా, చేసుకున్నా, సహకరించినా శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీమ్ లీడర్ అదినారాయణ, ఇన్‌చార్జ్ ఎస్ఓ విజేత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220717, 9912220727,
9912220726, 9010593486